నేటి నుంచి ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో సోమవారం నుంచి పంచాయతీ ఉపసర్పంచ్‌లకు, మరో ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు తెలిపారు ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సోమవారం, మంగళవారాలు మండలంలోని 17 పంచాయతీలకు, మిగతా 18 పంచాయతీలకు బుధవారం, గురువారాల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో పంచాయతీల అభివృద్ధి, జిపిడిఎఫ్ నిధులపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

లిక్కర్ కింగ్‌లెవరో?

- మళ్లీ సిండికేట్లకు జవసత్వాలు
- బెల్ట్ షాపులకు ఊతం
- ధర తగ్గినా మందుబాబుల జేబులకు చిల్లు ఖాయం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో లిక్కర్ కింగ్ లెవరో కొద్ది రోజుల్లో తేలిపోనుంది. జిల్లాలోని ఐదు ఎక్సైజ్ సర్కిల్స్ పరిధిలో మొత్తం 52 షాపులకు అధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం షాపులు ప్రభుత్వ షాపులుగా నడిచాయి. షాపుల్లో సేల్స్ మాన్ లు, సూపర్‌వైజర్ ఉద్యోగాలను భర్తీ చేసి ప్రభుత్వమే వారితో నడిపించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం విధానం అమల్లోకి రావడంతో మళ్లీ ప్రయివేటు షాపులు తెరపైకి వస్తున్నాయి. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం ప్రయివేటు పాపులే నడిచాయి. ఇప్పుడు కూడా అదే తరహాలో మద్యం షాపులు నడిచే అవకాశం ఉంది. ఒక్కో షాపుకి దరఖాస్తు ఫీజు కింద ప్రభుత్వం రూ.2లక్షలు నిర్ణయించింది. ఈ ఫీజు తిరిగి చెల్లించడానికి వీలులేని విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. అయినా దరఖాస్తు చేయడానికి మద్యం వ్యాపారులు వెనుకంజ వేయడం లేదు. పాత విధానంలో వ్యాపారులు దండిగా లాభాలను ఆర్జించారు. ఇప్పుడు కూడా అదే విధానాన్ని అమలు చేయడంతో పాత వ్యాపారులతో పాటు కొత్త వ్యాపారులు కూడా తెరపైకి వస్తున్నారు. ప్రధానంగా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు మద్యం వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉబలాట పడుతున్నారు.

సిండికేట్లకు జవసత్వాలు

గతంలో ప్రయివేటు షాపులు నిర్వహించిన సమయంలో వ్యాపారుల సిండికేట్‌గా ఏర్పడిన విషయం అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ అదే సిండికేట్ వ్యవస్థ రూపుదిద్దుకోనుందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. నూతన మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వం మద్యం ధరలు కొంత వరకు తగ్గించింది. గత ఎన్నికల్లో మందుబాబులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించింది. అయితే ధరలు తగ్గినా సిండికేట్ వ్యవస్థలో నిర్ధేశిత ధర కంటే పది నుంచి 20రూపాయల వరకు పెంచుకునే అవకాశం ఉంది. ఈ వెసులుబాటును గతంలో ప్రభుత్వాలే కల్పించాయి. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి మందుబాబులపై కొంతవరకు భారం పడనుంది. తాజా పరిస్థితుల్లో కూడా సిండికేట్ వ్యవస్థ ఏర్పడి ధరలు పెంచుకునే అవకాశం కలుగుతుంది. దీనికి తగినట్లుగానే వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పాటై మద్యం షాపులకు దరఖాస్తు చేస్తున్నారు. సిండికేట్ వ్యవస్థలో నాటుసారా నియంత్రణ బాధ్యతలను వ్యాపారులే నిర్వహిస్తారు. ఒకవేళ ఎవరైనా సారా విక్రయిస్తున్ననట్లు తెలిస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించి కేసులు నమోదు చేయిస్తారు.

బెల్ట్ షాపులకూ ఊతం

సిండికేట్ వ్యవస్థలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వ్యాపారులకు నచ్చిన వారికి ఇష్టారాజ్యంగా బెల్ట్‌షాపుల నిర్వహణకు అనుమతులిస్తారు. ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించాల్సిందే. బెల్ట్ షాపు యజమాని కూడా నిర్దేశించిన ధరపై ఐదో పదో రూపాయలు పెంచుకునే అవకాశం కల్పిస్తారు. మన్యం జిల్లాలో నాటుసారా విక్రయాలు ఎక్కువగా వున్నాయి. ఏజెన్సీ ప్రాంతం, ఒడిశాతో సరిహద్దులు కలిగి ఉండడంతో నాటుసారా విక్రయాలు గడిచిన ఐదేళ్లలో బాగా పెరిగాయి. ఇప్పుడు ప్రయివేటు మద్యం షాపులు అమల్లోకి రానుండడంతో నాటుసారాపై నియంత్రణకు వ్యాపారులే బాధ్యత వహిస్తారు. నాటుసారా నియంత్రణ జరిగితే తమ షాపుల్లో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందని సారా విక్రయాలను నియంత్రించే అవకాశం వుంటుంది.

11న తేలనున్న షాపుల కేటాయింపు

ఆదివారం సాయంత్రం 5వరకు మద్యం షాపులకు దరఖాస్తులు స్వీకరిస్తారు. శనివారం నాటికి మొత్తం 52 షాపులకు 174 దరఖాస్తులు అందినట్లు అధికారులు చెబుతున్నారు. ఈనెల 11న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సమక్షంలో మద్యం టెండర్లను తెరుస్తారు. అంతవరకు మద్యం కింగ్ లెవరనేది సస్పెన్స్ గానే మిగిలిపోతుంది.

మరో 3 రోజులే గడువు

52 మద్యం షాపులకు 174 దరఖాస్తులు

నూతన మద్యం పాలసీ ద్వారా జిల్లాలో 52 షాపులకు గాను 174 దరఖాస్తులు అందాయని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరించేందుకు ఇంకా మూడు రోజులే గడువు ఉన్నందున, మరింత ముమ్మర ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ఈనెల 9తో గడువు ముగుస్తున్నందున దరఖాస్తు దారులు పార్వతీపురం, సీతానగరం, సాలూరు, కురుపాం, పాలకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులను సమర్పించవచ్చన్నారు. జిల్లాలో నూతన మద్యం పాలసీ చాలా పారదర్శకంగా జరుగుతుందని, ఈనెల 11న జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి షాపులను కేటాయించనున్నట్టు పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌పి మాధవరెడ్డి

ప్రారంభమైన ఇసుక సరఫరా

అక్రమ రవాణాకు తావులేదు : కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో భామిని మండలం కాట్రగడ-బి వద్ద స్టాక్ పాయింట్‌గా ఇసుక సరఫరా ప్రారంభమైందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి పేర్కొన్నారు. అక్రమ రవాణాకు తావులేకుండా పారదర్శకంగా ఇసుక పంపిణీ చేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం విలేకరుల సమావేశంలో కలెక్టర్, ఎస్పీ ఇసుక సరఫరాపై వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలో భాగంగా భామిని మండలం కాట్రగడ- బి గ్రామంలో గల వంశధార ప్రాజెక్టు వద్ద ఇసుక స్టాక్ యార్డు గత నెల 20న ప్రారంభమైనట్లు చెప్పారు. ఈస్టాక్ యార్డ్ నుంచి ఇసుకను ఉచితంగా ఇవ్వనున్నామని, నిర్వహణ ఖర్చుల కింద మెట్రిక్ టన్ను ఇసుకకు రూ.182, పన్నుల నిమిత్తం రూ. 88 వెరసి రూ. 270 ఖర్చవుతుందని తెలిపారు. ఇసుక రీచ్ నుండి 1,05,000 మెట్రిక్ టన్నుల ఉచిత ఇసుక పంపిణీ లక్ష్యంగా నిర్ణయించుకొని ఇప్పటి వరకు 6,336 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వినట్లు చెప్పారు. గత నెల 20 నుంచి 4,698 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంచగా, అందులో 264 బుకింగులకు గాను, 185 బుకింగులకు సంబంధించి 3,252 మెట్రిక్ టన్నుల ఉచిత ఇసుకను ఇంతవరకు సరఫరా చేసినట్లు వివరించారు.

జిల్లాలో ఇసుక లభ్యతను పెంచేందుకు ఓపెన్ ఇసుక రీచ్ లను ప్రారంభించడానికి గాను మైనింగ్, ప్రణాళిక, పర్యావరణ అనుమతులు సాధ్యమైనంత తొందరగా పొందేందుకు చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. ఇసుక రీచ్ నుంచి దూరం, వాహన సామర్థ్యం అనుసరించి ధరలు నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇసుక పాలసీకి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, బుకింగులకు సాధ్యమైనంత త్వరగా డెలివరీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని గనుల శాఖ అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. పారదర్శకంగా ఇసుక పంపిణీ జరగాలని, ఇసుక కొరత లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. ఆన్ లైన్ ద్వారా తొలుత బుకింగ్ చేసుకున్న వారికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి మైనింగ్, పోలీసు, రవాణా, రెవెన్యూ శాఖల నుండి సిబ్బందిని టాస్క్ ఫోర్స్ బృందంగా ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే అక్రమ రవాణాకు పాల్పడుతున్న వాహనా లపై కేసులు బుక్ చేయడం, అమలులో ఉన్న ప్రభుత్వ ఆదేశా లను అనుసరించి తగు జరిమానా విధిస్తామని కలెక్టర్, ఎస్పీ హెచ్చరించారు.

ఇప్పటి వరకు భామిని మండలం నేరడిలో వెయ్యి మెట్రిక్ టన్నుల అక్రమ ఇసుకను జప్తు చేశామన్నారు. ఇసుక అక్రమ త్రవ్వకాలకు, రవాణాకు పాల్పడుతున్న 12 లారీలు, 2 జెసిబిలు, రెండు ట్రాక్టర్లు సీజ్ చేసి వారి నుంచి రూ.4లక్షలు జరిమానా వసూలు చేసి పాలకొండ పోలీసు స్టేషన్ నందు 2 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కురుపాం విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర స్థాయియి పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువు తున్న కె.శరణ్య ఎంపికైనట్లు కరాటే కోచ్ కె.నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అనంతపురం జిల్లాలో త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శరణ్య ఈ నెల 1న విజయనగరంలో రాజీవ్ గాంధీ స్టేడియంలో ఎస్‌జిఎఫ్ఐ కార్యదర్శి కృష్ణం రాజు ఆధ్వర్యంలో జరిగిన అండర్ 14 విభాగం పోటీల్లో ఎంపిక అయి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. శరణ్య రాష్ట్రస్థాయి కరాటేలకు ఎంపికైన నేపథ్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

కోచ్ నరేష్‌తో శరణ్య

మినీ అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

హామీలను అమలు చేయాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - సాలూరురూరల్

మినీ అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మినీ అంగన్వాడీల సమస్యలపై పట్టణంలో జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడారు. రాష్ట్రంలోని మినీ వర్కర్లందర్నీ ఎలాంటి షరతుల్లేకుండా మెయిన్ వర్కర్లుగా మార్చి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్లు వర్కర్లతో సమానంగా ఇవ్వాలని, సూపర్వైజర్ పోస్టులకు కూడా అర్హులు చేయాలని డిమాండ్ చేశారు. జనాభాతో సంబంధం లేకుండా మినీలను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, రాష్ట్రంలో అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. తొలుత ఇటీవల మరణించిన సిపిఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమా వేసిన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఈ దేశం లౌకిక దేశంగా ఉండాలని బలంగా కోరుకున్న వ్యక్తుల్లో ఏచూరి అగ్రభాగంలో ఉంటారని తెలిపారు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం ఉన్న పాలకులు కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజలు, కార్మికులు, ఉద్యోగుల సమస్యలు విడిచి కుల, మత ప్రాతిపదికన రాజకీయాలు చేస్తున్నారని, ఈ దేశానికి ఇవి మంచిది కాదని అన్నారు. అంగన్వాడీలు, మినీ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలన్నీ ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని, గతంలో చేసుకున్న మినిట్స్, ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది తెలిపారు. కార్యక్రమంలో మినీ అంగన్వాడీ నాయకులు ఉత్తరమ్మ, రామలక్ష్మి, పోలమ్మ, అంగన్వాడీ జిల్లా నాయకులు పార్వతి, నారాయణమ్మ, సిఐటియు నాయకులు ఎన్ వై నాయుడు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంతో గ్రామాల్లో అలజడి

- పట్టని అధికారులు, పాలకులు
- పంట నష్టంతో లబోదిబోమంటున్న రైతన్నలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలో ఐదు రోజుల క్రితం ప్రవేశించిన ఏనుగులు ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి మైదాన ప్రాంతాలకు ప్రవేశించడంతో ఎప్పటికి ఏం జరుగుతుందోనని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని దిబ్బగుడివలస, పుట్టూరు, పులుగుమ్మి, కవిటిభద్ర గ్రామాల మధ్యలో ఉన్న టేకు మామిడి తోటల్లో శనివారం ప్రవేశించిన గరిరాజుల గుంపు ఆదివారం కూడా కదలకపోవడంతో ఎప్పుడు ఎటు వెళ్తాయో అటవీ శాఖకు చెందిన ట్రాకర్లు అయోమయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వానలు పుష్కలంగా కురిసి పంటలు బాగా పండుతాయని, ఫలసాయం చేతికందుతుందన్న ఆశలో ఉన్న రైతాంగానికి అకస్మాత్తుగా ప్రవేశించిన ఈ ఏనుగుల గుంపు కళ్లముందే పంటను నాశనం చేస్తుంటే ఏమి చేయలేని అసహాయ పరిస్థితికి వారు ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. గత ఆరేళ్లుగా జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో సంచరిస్తుంటే, అటవీశాఖ అధికారులతో పాటు జిల్లా ఉన్నత అధికారులు వాటి కదలికలు గమనిస్తున్నారే తప్ప వాటిని తరలించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. మాట్లాడితే జంతి కొండ దగ్గర ఏనుగుల అభయారణ్యాన్ని ఏర్పాటు చేస్తామని ఒకసారి, కుంకీ ఏనుగులను తెప్పించి వాటిని మచ్చిక చేసుకుని లొంగ తీసుకుంటామని ఇంకొకసారి ప్రకటిస్తున్నారే తప్ప కార్యాచరణ చేపట్టక పోవడంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల సంచారం వల్ల పంటలు పండే సమయంలో కనీసం పొలాలకు రైతులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరిపంటను ధ్వంసం చేస్తున్న ఏనుగులు

ఏనుగుల దాడిలో ఇప్పటివరకు జిల్లాలో పలు మండలాలకు చెందిన 12 మంది ప్రాణాలు కోల్పోగా, విద్యుదా ఘాతాలకు గురై ఏనుగులు కూడా మరణించిన సంఘటన జరుగుతున్నాయి. ఇన్ని జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై నిరసన తెలియజేస్తున్నారు. ఏనుగులు పంటలను ధ్వంసం చేయగా వచ్చే పరిహారం కన్నా ఏనుగులను ఈ ప్రాంతాల నుండి తరలిస్తే ఇంకా ఎక్కువ సంతోషిస్తామని తెలియజేస్తున్నారు. ఇన్నాళ్లు నదీ పరివాహక ప్రాంతాలు, దట్టమైన అడవిల్లో ఉన్న ప్రాంతాలకే పరిమితమైన ఏనుగుల సంచారం ఇప్పుడు పార్వతీపురం మండలంలోని మైదాన ప్రాంతాల్లోకి రావడంతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి, చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ఏనుగుల సమస్యను గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి, పార్వతీపురం, కురుపాం ఎమ్మెల్యేలు విజయచంద్ర, జగదీశ్వరి, తీసుకువెళ్లగా కర్ణాటక నుంచి కుంకి ఏనుగులను తీసుకువచ్చి జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులను అదుపు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం చర్యలు వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఏనుగులు ధ్వంసం చేస్తున్న పంటలకు వెంటనే అంచనాలు వేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్వతీపురం మండలంలో ప్రవేశించిన ఏనుగులు వల్ల ఎలాంటి అఘాయిత్యం జరగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

ఎఎన్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణలత

ఎఎన్‌ఎంల సమస్యలపై

14న డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఎఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14న డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.స్వర్ణలత తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో (స్థానిక సుందరయ్య భవనం) యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్‌ఎంలు విస్తృత స్థాయి జిల్లా సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షులుబి.రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిహెచ్.స్వర్ణలత మాట్లాడుతూ సచివాలయ ఎఎన్‌ఎంలను మాతృ సంస్థ అయిన మెడికల్ డిపార్ట్మెంట్లో విలీనం చేయాలి, జీతాలు బిల్లులు కూడా హెల్త్ డిపార్ట్మెంట్ ద్వారా చెల్లించాలని, ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలు వర్తింపజేయాలని, 35 క్యాజువల్ లీవులు మంజూరు చేయాలని, యూనిఫారం, ఇతర అలవెన్సులు చెల్లించాలని, ఎఎన్‌ఎంపై పని భారం తగ్గించాలని తదితర సమస్యల పరిష్కారానికై ఈనెల 14న జిల్లా డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద జరిగే నిరసన ధర్నా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.ఇందిర, డివి రమణమ్మ, వి.గౌరీశ్వరి, పి.రమణమ్మ, అన్ని మండలాల ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం డివిజనల్ పోస్టల్ కార్యాలయాలో జరుగుతున్న పోస్టల్ వారోత్సవాల్లో పాల్గొని వాటిని విజయవంతం చేయాలని పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 11 వరకు, మెయిల్స్ పార్సిల్ దినోత్సవం, పిలాటిలి దినోత్సవం, ప్రపంచ తపాలా దినోత్సవం, అంత్యోదయ దినోత్సవం, విట్టియ సవర్తికారన్ దినోత్సవాల పేరిట సోమవారం నుంచి శుక్రవారం వరకు నిర్దేశిత తపాలా కార్యాలయాల్లో జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా డెలివరీ, స్టాఫ్ కు 100శాతం డెలివరీ సాధించేందుకు అవగాహన, వర్క్‌షాపు మెయిల్స్, పార్సిల్స్, కస్టమర్ మీట్, విద్యార్థులకు, ఖాతాదారులకు స్టాంపులు సేకరణపై అవగాహన కల్పిస్తామన్నారు. హైస్కూళ్లలో విద్యార్థులకు తపాలా శాఖపై అవగాహన కల్పించడం ఆధార్ స్టాంప్స్ ద్వారా అన్ని రకాల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌లు చేయడం, ప్రతి సబ్ డివిజన్ స్థాయిలో తపాలా బీమాపై అవగాహన సదస్సులు కొత్తపాలసీల సేకరణ, ఆపివేసిన పాలసీల పునరుద్ధరణ, తపాలా సేవింగ్స్ బ్యాంకు ఖాతాల సేకరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

పెచ్చులూడిపోయిన వాణిజ్య సముదాయ భవనం

వాణిజ్య సముదాయాల నిర్వహణ గాలికి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ నడిబొడ్డులో గల మున్సిపల్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న మున్సిపల్ వాణిజ్య సముదాయంలో నిర్వహణను మారుతున్న పాలకవర్గాలు గానీ, మున్సిపల్ అధికారులు గానీ, పట్టించుకోలేదన్నది ఈ వాణిజ్య సముదాయాల తీరుని చూస్తేనే తెలుస్తోంది. ఈ వాణిజ్య సముదాయాల లోపలకు వెళ్లాలంటేనే అద్దెకు ఉంటున్న వ్యాపారులు గానీ, కొనుగోలు చేసేందుకు వచ్చిన స్థానికులుగానీ ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. ఈ సముదాయాలను 2006లో అప్పటి పాలకవర్గం రూ.56 లక్షలతో ఐడిఎస్‌ఎంటి సముదాయం నిర్మించి, 50 దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ సముదాయాల నుంచి ప్రతి నెలా అద్దె రూపంలో రూ.3 లక్షల 50 వేలు చొప్పున్న, ఏడాదికి రూ.36 లక్షల 60 వేలు మున్సిపల్ కార్యాలయానికి ఆదాయ రూపంలో వస్తోంది. పట్టణ ప్రధాన రహదారి, పాత బస్టాండు, కూరగాయల మార్కెట్, చేపలు, గొర్రెల దుకాణాలు, మున్సిపల్ కార్యాలయం, పక్క పక్కనే ఉండడంతో అప్పట్లో పోటీపడి దుకాణాలను దక్కించుకున్నారు. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ వాణిజ్యసముదాయాల నిర్వహణపై మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు కనీసం దృష్టి పెట్టకపోవడంతో కొన్నేళ్ల నుంచి నిర్లక్ష్యానికి గురవుతోంది. పాలకవర్గంతో పాటు, అధికారులు మారుతున్నా వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఈ సముదాయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పలుచోట్ల స్లాబ్ పెచ్చులు వూడి, ఇనుప చువ్వలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. సముదాయం మధ్యలో మొక్కలు పెంచేందుకు ఉంచిన కాలువ స్థలం వ్యర్థాలతో దర్శనమిస్తోంది. సముదాయాల నడక మార్గం లో పశువుల సంచారం, స్థానికులు మలమూత్ర విసర్జన చేయడం, తోపుడు బండ్లు, మోటార్ సైకిల్ పార్కింగ్ చేయడంతో పాటు ఈ వాణిజ్య సముదాయాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి కూడా ఆక్రమణకు గురైంది. అయినా అటు మున్సిపల్ రెవెన్యూ అధికారులు గానీ, ఇటు పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు గానీ దృష్టి పెట్టకపోవడం విచారకరం. దీంతో పలువురు అద్దెదారులు స్వచ్ఛందంగా దుకాణా లను ఖాళీ చేసి వెళ్లి పోతున్నారు. షాపుల అద్దె ద్వారా వచ్చే ఆదాయం మున్సిపాల్టీకి ఆర్థికంగా ఆసారాగా ఉంటుందని, కావున స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు ఏకమైన మున్సిపల్ షాపుల సముదాయాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వాణిజ్య సముదాయానికి వచ్చే రోడ్డు దుస్థితి

ప్రజాశక్తి
www.prajasakti.com

లావణ్యకు స్వాగతం పలుకుతున్న టిడిపి అభిమానులు, కార్యకర్తలు

లావణ్యకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ట్రైకార్ బోర్డు మెంబర్‌గా పువ్వల లావణ్య శనివారం విజయవాడలో పదవీ బాధ్యతలు చేపట్టి ఆదివారం తన సొంత గ్రామమైన కురుపాం విచ్చేశారు. ఈ సందర్భంగా భారీగా ఆమె అభిమానులు ద్విచక్ర వాహనాలు, కార్లతో పార్వతీపురం జిల్లా కేంద్రానికి చేరుకొని అక్కడ నుంచి ర్యాలీగా తమ సొంత గ్రామానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుపాం ఎమ్మెల్యే టిక్కెట్ ఆశపడినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో కష్టపడి పార్టీ గెలుపునకు కృషి చేసినందుకు తనపై నమ్మకం ఉంచి ట్రైకార్ బోర్డు మెంబర్ పదవి ఇచ్చినందుకు ఆయనకు రుణపడి ఉంటానన్నారు. అలాగే పార్టీ ఆదేశాలు తూచా తప్పకుండా పాటిస్తూ తన పదవికి న్యాయం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో గల టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అదనపు భవన నిర్మాణ పనులు

శరవేగంగా పిఎంశ్రీ పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఆవరణలో పిఎం శ్రీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత విద్యా సంవత్సరంలో సుమారు రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మితమవుతున్న భవనం సకాలంలో బిల్లులు చెల్లింపులు జరగక గుత్తేదారు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. ఇటీవల బిల్లులు మంజూరవ్వడంతో మళ్లీ భవన నిర్మాణ పనులు ముందుకు సాగుతున్నాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు సన్షైడ్ శ్లాబు వేసి పైన శ్లాబ్ వేసి గోడలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

పంచాయతీ కార్యదర్శి స్వాతిని సన్మానిస్తున్న గ్రామస్తులు

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని చిన్నబొండపల్లికి పంచాయతీ కార్యదర్శిగా విశేష సేవలందించి బదిలీపై వెళ్తున్న వంగల స్వాతికి ఆదివారం పంచాయితీ సర్పంచ్ గండి శంకర్రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసి శాలువాతో సత్కరించి ఆమె చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిండు మనసుతో గ్రామస్తులు చేసిన సన్మానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని అన్నారు.

బడిదేవర కొండపై పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

బడిదేవర కొండకు వరద పాయసం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రతి ఏటా వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం మండలంలోని ములగ పంచాయతీలో ఉన్న బడిదేవర కొండకు వరద పాయశం పోసి మొక్కలు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా ఆదివారం సంగంవలస గ్రామస్తులు, రైతులు, సర్పంచి శ్రీరంజన్, మాజీ సర్పంచ్ అమరాపు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వరద పాయశం పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాల ప్రజలకు ఇష్ట దైవమైన బడిదేవరకొండను గ్రానైట్ తవ్వకాల పేరిట ప్రభుత్వం లైసెన్సులు ఇవ్వడం ఇక్కడ ప్రజల మనోభావాలకు దెబ్బతీయడమేనని అన్నారు. కనుక వెంటనే లైసెన్సులు రద్దు చేయాలని కోరారు.

ఘనంగా దుర్గాదేవికి పూజలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దసరా మహోత్సవాలు సందర్భంగా దుర్గాదేవి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మక్కవలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ప్రాంగణం భక్తులను సమేతంగా ఆకర్షిస్తోంది. ఇక్కడ ఉదయము నుండి రాత్రి వరకు ప్రతిరోజు హెూమాలతో పాటు పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని రోజుకొక అలంకరణతో పూజ చేస్తూ భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం పరిధిలో గల చెరువుల్లో చేపలు సాగు చేసుకుంటున్న మత్స్యకారులకు చెందిన శ్రీ స్వదేశీ మత్స పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షులు,గా బెహరా గున్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కారి రాము, డైరెక్టర్లుగా కె.సత్యనారాయణ, ఎస్.పోలందొర, సింగిడి గంగారావు, ఐ.సింహాచలం, కె.రమణ, కె.రత్తాలు ఎంపికైనట్లు డివిజన్ సహకార అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్ నగరం సర్పంచ్ వంగపండు త్రినాధ నాయుడుతో పాటుగా పలు గ్రామాలకు చెందిన సర్పంచులు పాల్గొన్నారు.

సమావేశంలో మత్స్యకార సహకార అధికారి

జలమివ్వని జలజీవన్

ఉత్సవ విగ్రహాలా దర్శనమిస్తున్న బోరు బావులు
వృథాగా పడి ఉన్న కుళాయి పాయింట్లు
గుక్కెడు నీటి కోసం ఆరాటం

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి పల్లెకు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని పాలకులు ప్రకటనకే పరిమితమవుతున్నారు తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా జలజీవన్ మిషన్ పనులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని యు.వెంకంపేట, చిదిమి, గడగమ్మ, విక్రంపురం, కొంచ, బట్టిగూడ, బూరుగ, చిన్నగోర, పివిఆర్ పురం, డెప్పివలస, చేబియ్యంవలస, తదితర గ్రామాల ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా గత ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి జలజీవన్ మిషన్ పనులు చేపట్టినప్పటికీ చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు గుక్కెడు నీటి కోసం ఆరాటం తప్పడం లేదు.

ఉత్సవ విగ్రహాల్లా బోరు బావులు

చిదిమి, బూరుగ, గడగమ్మ, తదితర గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా బోరు బావులు నిర్మించి తద్వారా పైప్‌లైన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి పాయింట్ల ద్వారా తాగునీరు అందించేందుకు బోరు బావులు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి విద్యుత్తు లైన్ గానీ, ఏ విధమైన పనులు పూర్తి చేయకపోవడంతో ప్రస్తుతం అవి గ్రామాల్లో ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. ప్రతి ఇంటికి కుళాయి పాయింట్ ద్వారా తాగునీరందిస్తారని ఎంతో సంబర పడ్డ ప్రజలకు నిరాశే మిగిలింది.

నీరురాని కుళాయి పాయింట్లు

గ్రామాల్లో బోరుబావులతో పాటు కొళాయి పాయింట్లు ఏర్పాటు

చిదిమిలో చుక్కనీరు రాని కుళాయి పాయింట్లు

చేసినప్పటికీ బోరు బావులకు ఎలాంటి పరికరాలు అమర్చకపోవడంతో ప్రస్తుతం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కుళాయి పాయింట్ల ద్వారా చుక్క నీరు రాక మూలనపడి ములుగుతున్నాయి. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న మాదిరిగా

రెల్లి వీధిలో అర్ధాంతరంగా నిలచిపోయిన రక్షిత మంచినీటి పథకం పనులు

జలజీవన్ మిషన్ పనులు ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కుళాయి పాయింట్ల ద్వారా ఎప్పుడు తాగునీరు వస్తాదా అంటూ వెయ్యి కళ్లతో గ్రామీణ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

తవ్వకాలకే పరిమితమైన పథకం పనులు

వీరఘట్టం మేజర్ పంచాయతీలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ద్వారా పట్టణ ప్రజలకు తాగునీరు సరిపోకపోవడంతో రూ.56 లక్షలతో రెల్లి వీధి వద్ద రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ ఏర్పాటుతో పాటు పైపులను కూడా ఏర్పాటు చేసి తద్వారా కొళాయిపాంట్ల ద్వార తాగునీరందించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం అక్కడ రక్షిత మంచినీటి పథకం పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఆ ప్రాంత వాసులకు ఆశలు సన్నగిల్లాయి. ఈ పనులు పూర్తి కాకపోవడంతో మేజర్ పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన జలజీవన్ మిషన్ పనులపై దృష్టి సారించి ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బెంబేలెత్తిస్తున్న ధరలు

కాగుతున్న వంటనూనె
నింగికెగిసిన కూరగాయలు
రూ.80కు చేరిన టమాటా
ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - సీతంపేట

దసరా పండుగ మరో వారం రోజుల్లో రానున్నది. అయితే ఇప్పటికీ నిత్యవసర ధరలు, కూరగాయల ధరలు ఒకసారి భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు నిత్యవసర ధరలతో పాటు కూరగాయల ధరలు కూడా ఒకేసారి అమాంతంగా పెరగడంతో ఏం కొనాలో... ఏం తినాలో అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పామాయిల్ రూ.100 నుంచి 120కు పెరగ్గా, రిఫండ్ ఆయిల్ రూ.105 నుంచి రూ.130కు పెరిగింది. వెల్లుల్లి రూ.400కు పైనే ఉంది. పెసరపప్పు రూ.120, మినపప్పు రూ.150, కందిపప్పు రూ.200కు పెరిగాయి. ఉల్లిపాయలు కూడా రూ.60కు పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వీటితో పాటు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పటికే టమాటా ఒక్కసారిగా కిలో రూ.40 నుంచి రూ.80కు పెరిగింది. బంగాళదుంపలు కిలో రూ.50, బీరకాయలు, చిక్కుడుకాయలు రూ.50కు పెరిగిపోయాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు పోవడంతో దూరం ప్రాంతాల నుంచి నిత్యవసర సరుకులు, కూరగాయలు రావడంతో రవాణా చార్జీలతో పాటు అధిక ధరలు పెరిగాయని వ్యాపారులు తెలుపుతున్నారు. ఏది ఏమైనా పెరిగిన ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపున దసరా పండుగ రావడంతో ఈ ధరలతో పండగ ప్రజలు ఎలా చేస్తామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీతంపేటలోని కూరగాయల దుకాణం

సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

పెద్దింపేటకు తాగు, సాగునీరందించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెద్దింపేటకు తాగునీరు, సాగునీరందించాలని సిపిఎం నాయకులు తీర్మానించారు. పెద్దింపేటలో సిపిఎం శాఖా మహాసభ సందర్భంగా పార్టీ జెండాను సీనియర్ సభ్యులు నారు సాంబమూర్తి ఆవిష్కరించారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఆలోచించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో మతతత్వ రాజకీయాలను ప్రేరేపించడానికి ప్రయత్నం చేస్తున్నాయని, అందులో భాగంగానే లడ్డూ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, విజయవాడ వరదలు, విభజన చట్టం హామీలు, సూపర్ సిక్స్, నిత్యవసర వస్తువుల ధరల తగ్గింపుపై ప్రభుత్వాలు దృష్టి పెట్టకుండా రాష్ట్రంలో మత వైషమ్యాలు సృష్టించడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. మహాసభ సందర్భంగా పెద్దింపేటలో తాగు, సాగునీరు అందించాలని, పారిశుధ్య సమస్యలపై దృష్టి పెట్టాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, గౌరీశ్వరరావు, సత్యం, కృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ గుడికి పోటెత్తిన యాత్రికులు

పాలకొండ : స్థానిక కోటదుర్గ అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమై నాలుగవ రోజు ఆదివారం కావడంతో యాత్రికులు పోటెత్తారు. వివిధ గ్రామాల నుంచి అనేక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనకు ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు పల్లా కొండలరావును, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, సుంకరి అనిల్ స్వాగతం పలికారు. అలాగే విజయనగరం జిల్లా జడ్జి నాగమణి పూజలు జరిపారు.

విశ్వనాధపురంలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

డయేరియా బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని విశ్వనాధపురంలో ఇటీవల డయేరియాతో మరణించిన కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, పారిశుధ్యం, రక్షిత మంచినీటి సమస్య పరిష్కరించాలని, సమస్యకు కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విశ్వనాధపురంలో డయేరియాతో చనిపోయిన వారి కుటుంబాలను ఆదివారం సిపిఎం బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికీ అనేకమంది వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారన్నారు. అనేకమంది ప్రైవేటు వైద్యం చేయించుకుంటున్నారని తెలిపారు. మంచినీటి సరఫరా చేసే ట్యాంకు పైప్ లైన్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, ట్యాంకు వద్ద నీళ్లు సరఫరా చేసే ప్రధానమైన పైపులైన్ మరమ్మతు గురైందని అన్నారు. నీళ్లు కలుషితమై మరణాలకు కారణమైందని తెలిపారు. గ్రామంలో ఇప్పటికే ఎంతో మంది డయేరియా వల్ల బాధపడుతున్నారని, వీరందరికీ మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరా చేసే పైప్ లైన్లన్నీ మార్చాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, వెంగళ అప్పలస్వామి, సింహాచలం, ఈశ్వరమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతాఫలాలకు ధర లేక విలవిల

ఆందోళన చెందుతున్న ఆదివాసీలు

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో గిరిజనులకు ఆర్థికంగా చేయుత ఇచ్చేది సీతాఫలాలు అని చెప్పవచ్చు. ఈ సీతాఫలాలకు మార్కెట్‌లో ధర పలకకపోవడంతో గిరిజనులు లబోదిబోమంటున్నారు. సీతాఫలాలను మధుర ఫలాలని కూడా పిలుస్తారు. సీతాఫలాల్లో అధికంగా పోషకాలు ఉండడంతో పాటు తీయగా, రుచిగా ఉండటంతో వీరికి గిరాకీ ఎక్కువ. దీంతో మైదాన ప్రాంత వ్యాపారులు వీటి కోసం ఏకబాకురుతారు. ఏజెన్సీలో శంభాం, కుసిమి, ధోనుబాయి, పొల్ల, పూతికవలస, మర్రిపాడు పరిసర ప్రాంతాల్లో సుమారు 10వేల ఎకరాల్లో ఈ పంట ఉంది. అయితే ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంట తక్కువ అని చెప్తున్నారు. సీతాఫలాలు ఆగస్టు, అక్టోబర్‌లో పంట కాపుకు వస్తుంది. ఈ ఫలాల కొనుగోలకు మైదాన ప్రాంత వ్యాపారులు విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, శ్రీకాకుళం, ఒడిశాలోని పర్లాకిమిడి, భువనేశ్వర్, కటక్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వాహనాల ద్వారా వస్తున్నారు. ఆదివారం సాయంత్రం నుండి సోమవారం మధ్యాహ్నం వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక ట్రేలో 20 కేజీల నుంచి 25 కేజీల వరకు ఉంటుంది. గతంలో ట్రే రూ.900 వరకు ధర

సీతంపేట సంతలో విక్రయిస్తున్న సీతాఫలాలు

పలికితే ప్రస్తుతం రూ.500 ధర పలకడంతో సగానికి సగం పడిపోయిందని గిరిజనులు లబోదిబోమంటున్నారు. ఇక్కడ వ్యాపారులు తక్కువ ధరకే అడగడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

నీరు లేక ఎండుతున్న మొక్కలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణ సుందరీకరణ కోసం నాటిన మొక్కలకు నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. పట్టణ సుందరీకరణ కోసం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై పువ్వులు మొక్కలు నాటారు. మొక్కలకు నీరు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి. మొక్కల సంరక్షణకు గతంలో దినసరి వేతనంతో 16 మంది కార్మికులను మున్సిపల్ అధికారులు నియమించారు. ఆయా కార్మికులు రాణిమల్లమ్మదేవి పార్కు, యుద్ధ స్తంభం పార్కులో మొక్కలను సంరక్షించి పరిసరాలను పరిశుభ్రం చేసేవారు. రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఉన్న పువ్వులు మొక్కలకు, ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జ్యూట్ మిల్లు వరకు రోడ్డు మధ్యలో మొక్కలకు నీరు పోసి సంరక్షణ చూసే వారు. దినసరి వేతనంతో పని చేస్తున్న కార్మికులకు చెల్లించే వేతనాల వివరాలు సక్రమంగా రికార్డులో నమోదు చేయకపోవడంతో ఆడిట్ కమిటీ అభ్యంతరం చెప్పి వేతనాలు బిల్లులు నిలిపివేశారు. దినసరి వేతనాలతో పని చేస్తున్న కార్మికులను మూడు నెలల నుంచి పనిలోకి తీసుకోలేదు. దీంతో మొక్కలు సంరక్షణ లేకపోవడంతో ఎండిపోతున్నాయి.

పత్తి, వరిలో తెగుళ్ల ఉధృతి

ప్రజాశక్తి - పాచిపెంట

వర్షాలు తర్వాత అధిక వేడి, ఉక్కపోత వాతావరణం వల్ల పత్తిలో రసం పీల్చు పురుగు, వరిలో ఆకుచుట్టు పురుగుల బెడద ఎక్కువైందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. పత్తిలోని రసం పీల్చు పురుగులు ఆకుల్లో రసాలను పిల్చేయడం వల్ల ఆకులు పసుపు రంగులోనికి మారి గిడసబారి పోతాయని అన్నారు. ఈ మేరకు ఆయన మండలంలోని పాంచాలి, మోసూరులో ఆదివారం ఇ- పంట నమోదును పరిశీలిస్తూ పంటలకు ఆశించిన పురుగులు తెగుళ్లను పరిశీలించారు. పత్తిలో రసం పీల్చు పురుగులతో పాటు కాయ కుళ్లు తెగులు కూడా ఆశించిందన్నారు. వీటి నివారణకు తయోమెతాక్జోమ్ లేదా ఇమిడా క్లోప్రిడ్ మందులలో ఒక దాన్ని 100 గ్రాములు 200 మిల్లీలీటర్ల ప్రాఫి కొనజోల్ మందుతో కలిపి ఒక ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే రసం పీల్చే పురుగుల వల్ల పంటల్లో జీవం తగ్గిపోతుందన్నారు. కావున మెగ్నీషియం, బోరాన్ మల్టీకే లను పిచికారీ చేసుకుంటే మళ్లీ చిగురుస్తాయని తెలిపారు. అలాగే ఎక్కడైతే వరి పంటలో అధిక యూరియా వాడిన చోట ఆకు చుట్టు పురుగు ఆశించిందని, ఇది ఆకులను మడిచి రెండు చివర్లను దారంతో కుట్టి లోపల నివాసాన్ని ఏర్పర్చుకొని పత్ర హరితాన్ని గీకి తినేయడం వల్ల చేనంతా సున్నం చలినట్లుగా తెల్లగా

పత్తిపంటలకు సోకిన రసంపీల్చు పురుగును పరిశీలిస్తున్న ఎఒ

మారిపోతుందని తెలిపారు. దీని నివారణకు ముందుగా ఒక కంప పంటపై లాగినట్లయితే పురుగులన్నీ బయటకు వచ్చేస్తాయన్నారు. అనంతరం క్లోరిపైరీఫాస్ 20 ఇసి ఎకరానికి 500 మిల్లీలీటర్లు పిచికారీ చేసుకున్నట్లయితే దీన్ని సమర్థవంతంగా నివారించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బాలకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం విద్యార్థి యువజన సంఘాలు, కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నేతలు ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఆదివారం బొబ్బిలిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విశాఖపట్నం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన స్టీల్ ప్లాంట్‌ను అదానీ అంబానీలకు కారు చౌకగా కట్టబెట్టడానికి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుందన్నారు. దీన్ని అడ్డుకోవడానికి చేస్తున్న ఆందోళన కార్యమ్రంలో కూటమి ప్రభుత్వం కూడా పాల్గొనాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

చెట్టును ఢీకొన్న తారు ట్యాంకర్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేట సమీపాన ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తారు ట్యాంకర్ చెట్టును ఢీకొంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న తారు ట్యాంకర్ లారీ అదుపు తప్పి అంటిపేట సమీపాన గల చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం డ్రైవర్ కె.రమణ లారీలో ఇరుక్కుపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఆయన్ను బయటకు తీశారు. అనంతరం చికిత్స నిమిత్తం పార్వతీపురం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

ఎటువంటి అనుమతుల్లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను నిడగలు గ్రామ సమీపాన ఆదివారం ఎస్సై రాజేష్ పట్టుకున్నారు. అనంతరం దీనిపై కేసు నమోదు చేసుకొని వాహనాలను స్థానిక తహశీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు